PRGI Reg No. TGTEL/25/A0555
https://www.youtube.com/@PrabhathaSuryuduNews
https://www.facebook.com/prabhathasuryudu

# ప్రభాత సూర్యుడు

నిజం దాగదు.. వార్త ఆగదు
జాతీయ తెలుగు దినపత్రిక
www.prabhathasuryudu.com

తెలంగాణ | సంపుటి : 01 | సంచిక :189 | పేజీలు : 8 | వెల రూ.5 | గురువారం30.07.2026

ఎడిటర్ : చెరుకు ఉపేందర్
Published From Rangareddy
Circulated by All Districts of Telangana and Andhra Pradesh






# 'సర్' ప్రక్రియను.. వేగవంతం చేయాలి

## బీఎల్‌ఏలు చురుగ్గా పనిచేయాలి

- ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క
- ఇప్పటికే 50 శాతానికి పైగా పూర్తి
- టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్

ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) ప్రక్రియకు గడువు సమీపిస్తున్నందున కాంగ్రెస్ బూత్ స్థాయి ఏజెంట్లు (బీఎల్‌ఏలు) మరింత వేగంగా పనిచేయాలని ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సూచించారు. ఢిల్లీ ఇందిరాభవన్‌లో జరిగిన తెలంగాణ కోఆర్డినేషన్ కమిటీ సమావేశంలో ఆయన ఈ అంశంపై చర్చించారు. అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించేలా చర్యలు తీసుకోవాలని, ఎమ్మెల్సీ గ్రాడ్యుయేట్ ఎన్నికలపై జిల్లా ఇన్‌చార్జులు, పీసీసీలతో చర్చించి నివేదిక ఇవ్వాలని సూచించారు. ప్రభుత్వ కార్యక్రమాలను ప్రజలకు చేరువ చేసేలా కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు.

హైదరాబాద్,ప్రభాత సూర్యుడు

### 50 శాతం పూర్తి

సర్ ప్రక్రియపై సమీక్ష నిర్వహించామని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్‌కుమార్ గౌడ్ తెలిపారు. రాష్ట్రంలో 36 వేల మంది బీఎల్‌ఏలను నియమించామని, ఇప్పటికే 50 నుంచి 60 శాతం ప్రక్రియ పూర్తయిందని చెప్పారు. మరో రెండు, మూడు రోజుల్లో వంద శాతం పూర్తి చేస్తామని తెలిపారు. ఓటర్ల హక్కులను కాపాడడమే తమ లక్ష్యమని, ఈసారి సర్ ప్రక్రియపై అనుమానాలు ఉన్నందున అప్రమత్తంగా వ్యవహరిస్తున్నామని పేర్కొన్నారు. పార్టీ సంస్థాగత బలోపేతం, ప్రభుత్వం-పార్టీ సమన్వయంపై సమావేశంలో చర్చించినట్లు వెల్లడించారు.

### కోఆర్డినేషన్ కమిటీ భేటీ

మీనాక్షి నటరాజన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీఎం రేవంత్‌రెడ్డి, భట్టి విక్రమార్క, మహేశ్‌కుమార్ గౌడ్, మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, సీతక్క, దామోదర్ రాజనర్సింహ, వంశీచంద్ తదితరులు పాల్గొన్నారు. సర్ ప్రక్రియతో పాటు రానున్న స్థానిక సంస్థల ఎన్నికలు, ప్రభుత్వ పథకాల ప్రచారం, పార్టీ బలోపేతంపై చర్చించారు.




# 'ఎమర్జెన్సీ' సమయంలో నిరసన చేస్తే.. నన్నూ అరెస్ట్ చేశారు: జేపీ నడ్డా



ఢిల్లీ, ప్రభాత సూర్యుడుదిల్లీలో నిరసన చేపట్టిన విద్యార్థులపై పోలీసులు లాఠీఛార్జి చేయడాన్ని కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే తప్పుబట్టారు. ఈ విషయంపై రాజ్యసభలో మాట్లాడుతూ.. అణచివేతకు బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై కేంద్రమంత్రి జేపీ నడ్డా స్పందిస్తూ.. విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు తాను కూడా చాలాసార్లు అరెస్టయినట్లు తెలిపారు. కాంగ్రెస్ పాలనలో ఎమర్జెన్సీ విధించినప్పుడు పోలీసులు తనను తరగతి గదిలోనే అరెస్ట్ చేశారని వెల్లడించారు. సామాజిక కార్యక్రమాలలో పాల్గొనే ఏ విద్యార్థి అయినా ఇలాంటి పరిస్థితిని ఎదుర్కోవాల్సి వస్తుందన్నారు. శాంతిభద్రతలను కాపాడటానికి, ఆందోళనకారులను అదుపు చేయడానికి పోలీసులు చట్ట ప్రకారమే వ్యవహరించారని నడ్డా పేర్కొన్నారు. ఈ విషయాన్ని ప్రతిపక్షాలు రాజకీయం చేయాలని చూస్తున్నాయని విమర్శించారు. సీజేపీకి మద్దతుగా ఆందోళనల్లో పాల్గొన్నందుకు పోలీసులు బుధవారం సీపీఎం ఆఫీస్‌పై దాడి చేశారని ఆ పార్టీ ఎంపీలు చేసిన ఆరోపణలను కేంద్ర మంత్రి ఖండించారు. దీంతో రాజ్యసభలో కొంతసేపు గందరగోళం నెలకొంది.

**బిల్లుపై చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయి: రిజిజు**
యాంటీ-పేపర్ లీక్ బిల్లుపై లోక్‌సభలో చర్చ జరగకుండా ప్రతిపక్షాలు అడ్డుకుంటున్నాయని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు.

# ఇథనాల్ వాడితే.. ఆ పరికరాలు మార్చాల్సి రావొచ్చు : గడ్కరీ

ఢిల్లీ, ప్రభాత సూర్యుడు ఈ20 పెట్రోల్ వినియోగించే (2016కు ముందు తయారైన) బీఎస్-3 వాహనాల్లో చిన్నపాటి రిపేర్లు ఉండే అవకాశం ఉందని కేంద్ర ప్రభుత్వం వెల్లడించింది. కొన్ని రబ్బరు భాగాలు, గ్యాస్కెట్లు మార్చాల్సి రావచ్చని తెలిపింది. వాహన పనితీరు, మన్నిక, మైలేజీని అది అధిక స్థాయిలో ప్రభావితం చేయదని స్పష్టం చేసింది. ఈ విషయాన్ని కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ రాజ్యసభలో లిఖితపూర్వక సమాధానంలో తెలిపారు. ఐఓసీఎల్, ఐఐపీ- డెహ్రాదూన్, సియామ్, ఏఆర్ఏఐ సంయుక్తంగా నిర్వహించిన అధ్యయనాల్లో ఈ20 ఇంధనం వినియోగించే వాహనాల ఇంజిన్‌లలో ఎలాంటి మార్పులు అవసరం లేదని తేలిందన్నారు. ఈ20 అమలుకు ముందు విస్తృత స్థాయిలో ప్రయోగశాల పరీక్షలు, ఫీల్డ్ ట్రయల్స్, మన్నిక పరీక్షలు నిర్వహించినట్లు గడ్కరీ తెలిపారు. అంతా బాగుందని తెలిసిన తర్వాతే దశల వారీగా దేశవ్యాప్తంగా అమలు చేసినట్లు పేర్కొన్నారు. ఈ20 పెట్రోల్ వినియోగించే పాత వాహనాల్లోనూ (2016కు ముందు తయారైన) పనితీరు, ఇంజిన్ అరిగిపోవడం, డ్రైవబిలిటీ, స్టార్టబిలిటీ, లోహాలు, ప్లాస్టిక్ భాగాల అనుకూలత వంటి అంశాల్లో సమస్యలు కనిపించలేదని వివరించారు.



# యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం

ఢిల్లీ, ప్రభాత సూర్యుడు యాంటీ పేపర్ లీక్ బిల్లుకు లోక్‌సభ ఆమోదం తెలిపింది. మూజువాణి ఓటుతో 'ది పబ్లిక్ ఎగ్జామినేషన్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్లు'కు ఆమోదం లభించింది. విపక్షాలు పలు సవరణలు కోరినప్పటికీ.. అవి వీగిపోయాయి. పేపర్ లీక్‌లకు పాల్పడే వారిపై కఠిన చర్యలు ఉంటాయని ఈ సందర్భంగా ప్రభుత్వం స్పష్టం చేసింది. ఇందుకు సంబంధించి బిల్లులో నిబంధనలు రూపొందించామని తెలిపింది. అనంతరం సభ గురువారానికి వాయిదా పడింది. ఈ బిల్లుపై చర్చలో భాగంగా ఆయా పార్టీల సభ్యులు మాట్లాడిన అనంతరం.. చివరగా కేంద్ర మంత్రి జితేంద్ర సింగ్ వివరణ ఇచ్చారు. ఈ సందర్భంగా రాహుల్ గాంధీపై తీవ్ర స్థాయిలో ధ్వజమెత్తారు. పార్లమెంటరీ వ్యవహారాలపై రాహుల్‌కు అవగాహన లేదని, ప్రభుత్వం ఎలా నడుస్తుందో ఆయనకు తెలియదని మండిపడ్డారు. 2024లో యాంటీ పేపర్ లీక్ చట్టం అమల్లోకి వచ్చినప్పటి నుంచి 52 ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యాయని పేర్కొన్నారు. నీట్ పేపర్ లీకైన వెంటనే ప్రభుత్వం వేగంగా స్పందించిందని, అనుభవాల నుంచి నేర్చుకునేందుకు తమ ప్రభుత్వం సిద్ధంగా ఉందనడానికి పేపర్ లీక్ నిరోధక సవరణ బిల్లు నిదర్శనమన్నారు.

# బంగాళాఖాతంలో మునిగిన వాళ్లే హైడ్రాను ముంచుతామంటారా?'.. కేటీఆర్‌పై తుమ్మల సెటైర్

హైదరాబాద్, జులై 29 ప్రభాత సూర్యుడుహైడ్రాపై మాజీ మంత్రి కేటీఆర్ చేసిన వ్యాఖ్యలకు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. బుధవారం మీడియాతో మాట్లాడుతూ.. బంగాళాఖాతంలో మునిగిపోయిన వాళ్లే హైడ్రాను బంగాళాఖాతంలో వేస్తామంటే అర్థం లేదంటూ సెటైర్ విసిరారు. వర్షాకాలం వచ్చినా ఇప్పటికీ 30 శాతం లోటు వర్ష పాతం నమోదైందని తెలిపారు. 150 ఏళ్ల నుంచి చూడని ప్రకృతి వైపరీత్యం వచ్చిందన్నారు. ఆగస్టు, సెప్టెంబర్, అక్టోబర్‌లో కూడా తీవ్ర ఎల్‌నినో ప్రభావం ఉంటుందని చెప్పుకొచ్చారు. ప్రకృతి వైపరీత్యాన్ని గ్రామగ్రామాన ప్రజలకు తెలియజేస్తున్నామని తెలిపారు. అన్ని శాఖల సమన్వయంతో పని చేస్తున్నామన్నారు. రైతులు మెట్ట పంటలు వేస్తున్నారని మంత్రి తెలిపారు. ఆయిల్ పామ్ వైపు ఎక్కువగా రైతులు మొగ్గుచూపుతున్నారని, ఇది మంచి శుభపరిణామమని అన్నారు. గాంధీ భవన్‌ను దేవాలయంగా భావించి నమ్మకంతో ప్రజలు సమస్యలు చెప్పుకోవడానికి వస్తున్నారన్నారు. ప్రజల నుంచి వచ్చిన ఫిర్యాదులను సంబంధిత అధికారులకు పంపిస్తున్నామని తెలిపారు. ఏ పార్టీ నిర్వహించని ముఖాముఖిని కాంగ్రెస్ నిర్వహిస్తోందన్నారు. కలెక్టర్లతో మాట్లాడి సమస్యలను పరిష్కారం చేస్తున్నామని చెప్పారు. సంబంధిత శాఖ అధికారులకు పంపిస్తూ రిపోర్ట్ అడుగుతున్నామన్నారు. ముఖాముఖి నిర్వహిస్తున్న పీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్‌కు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ధన్యవాదాలు తెలియజేశారు.



# 'వందేమాతరం' సవరణ బిల్లుకు రాజ్యసభ ఆమోదం..

న్యూఢిల్లీ,ప్రభాత సూర్యుడుజాతీయ గేయం 'వందేమాతరం' గౌరవాన్ని కాపాడేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు రాజ్యసభ ఆమోదం తెలిపింది. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ఈ నెల 24వ తేదీన ఎగువసభలో ఈ బిల్లును ప్రవేశపెట్టగా.. బుధవారం సుదీర్ఘ చర్చ అనంతరం సభ ఆమోదముద్ర వేసింది. ఇకపై వందేమాతరాన్ని అవమానించినా, లేదా ఎవరైనా ఆలపిస్తున్న సమయంలో ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించినా దాన్ని చట్టప్రకారం తీవ్ర నేరంగా పరిగణించేలా చట్టం చేయనున్నారు. వందేమాతరం బిల్లులో భాగంగా చరిత్రాత్మక 'ది ప్రివెన్షన్ ఆఫ్ ఇన్సల్ట్స్ టు నేషనల్ ఆనర్ యాక్ట్ - 1971' (జాతీయ గౌరవానికి భంగం కలిగించే నిరోధక చట్టం)లో కీలక సవరణలు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించింది. ప్రస్తుతం భారత జాతీయ గీతమైన 'జనగణమన'కు ఎలాంటి చట్టపరమైన రక్షణలు అమల్లో ఉన్నాయో.. అవే అత్యున్నత రక్షణలను జాతీయ గేయమైన వందేమాతరానికి కూడా వర్తింపజేయడమే ఈ బిల్లు ముఖ్య ఉద్దేశమని కేంద్రం స్పష్టం చేసింది.

# పులుల సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలి

## అడవులను కాపాడితేనే భావితరాలకు పచ్చని తెలంగాణ -- మంత్రి కొండా సురేఖ






మేడ్చల్ మల్కాజ్గిరి జూలై 29 ప్రభాత సూర్యుడు:పులుల సంరక్షణ పట్ల సమాజంలోని అన్ని వర్గాలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ పిలుపునిచ్చారు. భూమి కేవలం మనుషులకే కాకుండా సమస్త జీవరాశులకు ఉమ్మడి నివాసమని, ప్రకృతి పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని అన్నారు. అంతర్జాతీయ పులుల దినోత్సవాన్ని పురస్కరించుకుని మేడ్చల్--మల్కాజ్గిరి జిల్లా దూలపల్లిలోని తెలంగాణ స్టేట్ ఫారెస్ట్ అకాడమీలో నిర్వహించిన కార్యక్రమానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సందర్శించి, పులుల సంరక్షణపై రూపొందించిన లఘుచిత్రాన్ని వీక్షించారు. ప్రతి సంవత్సరం జూలై 29న ప్రపంచ పులుల దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. పులి అటవీ సంపదకు ప్రతీక అని, పులులను సంరక్షించడమంటే అడవులు, పర్యావరణం, జీవవైవిధ్యంతో పాటు భావితరాల భవిష్యత్తును కాపాడటమేనని పేర్కొన్నారు. వేట, అడవుల నరికివేత, అక్రమ రవాణా వంటి కారణాలతో పులుల సంఖ్య గతంలో గణనీయంగా తగ్గిందన్నారు. నాటి ప్రధాని ఇందిరాగాంధీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం 1972లో వన్యప్రాణి సంరక్షణ చట్టాన్ని, 1973లో ప్రాజెక్ట్ టైగర్‌ను ప్రారంభించి పులుల సంరక్షణకు పటిష్ట చర్యలు చేపట్టిందని వివరించారు. ప్రస్తుతం ప్రపంచంలోని పులుల్లో సుమారు 75 శాతం భారత్‌లోనే ఉన్నాయని, దేశవ్యాప్తంగా 58 టైగర్ రిజర్వులు పనిచేస్తున్నాయని తెలిపారు. తెలంగాణలోని అమ్రాబాద్, కవ్వాల్ టైగర్ రిజర్వులు పులుల సంరక్షణలో కీలకంగా నిలుస్తున్నాయని అన్నారు. అమ్రాబాద్‌లో నీటి వనరుల అభివృద్ధి, ఆవాసాల మెరుగుదల, ఆధునిక రక్షణ చర్యలతో పులుల సంఖ్య పెరిగిందని చెప్పారు. కవ్వాల్‌లో పులుల సంఖ్యను పెంచేందుకు టైగర్ రీఇంట్రడక్షన్ కార్యక్రమాన్ని చేపట్టామని, మహారాష్ట్రలోని తడోబా టైగర్ రిజర్వుతో అనుసంధానం ద్వారా పులుల సహజ సంచారానికి అనుకూల పరిస్థితులు కల్పిస్తున్నట్లు వివరించారు. "అడవులను కాపాడుకుందాం.. వన్యప్రాణులను సంరక్షిద్దాం.. భావితరాలకు పచ్చని తెలంగాణను అందిద్దాం" అని ఆమె పిలుపునిచ్చారు. ఫారెస్ట్ అకాడమీలో శిక్షణ పొందుతున్న వివిధ రాష్ట్రాల అభ్యర్థులు అటవీ సంపద పరిరక్షణలో నిబద్ధత, నిజాయితీ, సేవాభావంతో పనిచేయాలని సూచించారు. అటవీ, వన్యప్రాణుల సంరక్షణలో విశేష కృషి చేసిన అటవీ శాఖ ఉద్యోగులకు ప్రశంసా పత్రాలు, నగదు బహుమతులు అందజేశారు. అంతర్జాతీయ పులుల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన చిత్రలేఖన పోటీల్లో విజేతలైన విద్యార్థులకు బహుమతులు, ప్రశంసా పత్రాలను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో అటవీదళాల ప్రధాన సంరక్షణాధికారి వినయ్‌కుమార్, కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన విశ్వవిద్యాలయం వైస్‌చాన్స్‌లర్ దండా రాజిరెడ్డి, పీసీసీఎఫ్ (డెవలప్‌మెంట్) రత్నాకర్ జౌహరి, సీసీఎఫ్ ప్రియాంక వర్గీస్, సీసీఎఫ్ క్షితిజ, టైగర్ సెల్ రీసెర్చ్ సైంటిస్ట్ అయాన్ సాధు, అమ్రాబాద్ ఫీల్డ్ డైరెక్టర్ ప్రసాద్, కవ్వాల్ టైగర్ రిజర్వ్ ఫీల్డ్ డైరెక్టర్ శాంతారాం తదితరులు పాల్గొన్నారు.

# కోమటిపల్లి అడవిలో భారీ వృక్షాల నేలకూలుడు

## పరిశీలించినబీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు



ములుగు జూలై 29, ప్రభాత సూర్యుడు:ములుగు జిల్లా మంగపేట మండలం పరిధిలోని కోమటిపల్లి అడవిలో ఇటీవల అకస్మాత్తుగా సంభవించిన ప్రకృతి వైపరీత్యం కారణంగా కొన్ని మహావృక్షాలు నేలకూలిన సంఘటన తీవ్ర కలకలం రేపింది. ఈ విపత్తులో దెబ్బతిన్న అటవీ ప్రాంతాన్ని, కూలిపోయిన చెట్లను బుధవారం ములుగు జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కాకులమర్రి లక్ష్మణ్ బాబు స్వయంగా సందర్శించి పరిశీలించారు

ఈ సందర్భంగా ఆయన అడవిలో దెబ్బతిన్న ప్రాంతాన్ని కలియతిరుగుతూ, చెట్లు ఏ విధంగా నేలకూలాయి అనే వివరాలను పరిశీలించారు. మేడారం అడవుల్లో గతంలో జరిగిన సంఘటన మాదిరిగానే, ఇక్కడ కూడా బలమైన ఈదురుగాలులు లేదా సుడిగాలి ప్రభావం వల్లనే ఈ భారీ నష్టం వాటిల్లినట్లు స్థానికులు మరియు అధికారుల ద్వారా తెలుసుకున్నారు. ఈ సందర్భంగా లక్ష్మణ్ బాబు మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాల కారణంగా అడవి ధ్వంసమవడం తీవ్ర ఆందోళనకరమని, దీనివల్ల పర్యావరణానికి మరియు వన్యప్రాణులకు నష్టం వాటిల్లుతుందని పేర్కొన్నారు. అటవీ శాఖ అధికారులు తక్షణమే స్పందించి, కూలిపోయిన చెట్లను తొలగించడంతో పాటు ఆ ప్రాంతంలో ప్రత్యేక అటవీ పునరుద్ధరణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. పర్యావరణ సమతుల్యతను కాపాడటానికి, భవిష్యత్తులో ఇలాంటి నష్టాలను నివారించడానికి ప్రభుత్వ పరంగా తగిన రక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తాటి కృష్ణ, కాకులమర్రి ప్రదీప్ రావు, తుమ్మ మల్లారెడ్డి, బాడిషా నాగ రమేష్, కూనూరు అశోక్ గౌడ్, చిట్టి మల్ల సమ్మయ్య, సిద్ధంశెట్టి లక్ష్మణరావు, ఎస్.కె. కుర్బాన్ అలీ, యలవర్తి శ్రీనివాసరావు, తాడూరి రఘు, కర్ర రవీందర్, ఎండి. అయూబ్, జాడి భోజారావు, సంకోజు ప్రశాంత్, మూగల రమేష్, రావుల రమణ సంతోష్, గండపల్లి నర్సయ్య, మునగాల నరేష్, మునిగల సాంబులు, పుల్ల సోయం ఈశ్వరయ్య, వంశీ, మునగాల మహేష్, జాడి కృష్ణ. స్థానిక బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# గురు పౌర్ణమి సందర్భంగా సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు

## – ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మంచిరెడ్డి కిషన్ రెడ్డి, ప్రశాంత్ కుమార్ రెడ్డి

ఇబ్రాహీంపట్నం-- ప్రభాత సూర్యుడు గురు పౌర్ణమి సందర్భంగా రంగారెడ్డి



జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కొంగర కలాన్‌లో ఉన్న శ్రీశ్రీశ్రీ సాయిబాబా దేవాలయంలో బీఆర్ఎస్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్ రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్ కుమార్ రెడ్డి (బంటి) స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ఇబ్రహీంపట్నం నియోజకవర్గంతో పాటు రంగారెడ్డి జిల్లా ప్రజలకు గురు పౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. శ్రీ సాయిబాబా వారి ఆశీస్సులు ప్రజలందరిపై ఎల్లప్పుడూ ఉండాలని, అందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని ప్రార్థించారు.

# అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తాం.

## పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన మంత్రి పొంగులేటి.



ఖమ్మం, జూలై 29 ప్రభాత సూర్యుడు:.ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధి జోడేడ్లలా, రెండు కళ్లుగా ముందుకు సాగుతోందని రాష్ట్ర రెవెన్యూ, హౌజింగ్, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం పాలేరు నియోజకవర్గంలో విస్తృతంగా పర్యటించిన మంత్రి, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డా. పి. శ్రీజ తో కలిసి ఖమ్మం రూరల్ మండలంలోని పలు అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపనలు చేశారు. డాక్యా తండా గ్రామంలో రూ.1.41 కోట్ల వ్యయంతో మంగళగూడెం-- డాక్యా తండా బీటీ రోడ్డు నిర్మాణ పనులకు, అనంతరం పల్లెగూడెం గ్రామంలో రూ.5.80 కోట్లతో గొల్లగూడెం నుండి ఎన్.ఎస్.పీ. మీదుగా పల్లెగూడెం వరకు బీటీ రోడ్డు నిర్మాణ పనులకు మంత్రి శంకుస్థాపన చేశారు.

**మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ...**

రైతుల సంక్షేమానికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందని మంత్రి తెలిపారు. రైతు భరోసా ద్వారా ప్రతి ఎకరానికి రూ.6 వేల చొప్పున 9 రోజుల్లో 9200 కోట్లు రైతుల ఖాతాల్లో నేరుగా నిధులు జమ చేశామని, వరి రైతులకు మద్దతు ధరతో పాటు సన్న వరిధాన్యానికి అదనంగా రూ.500 బోనస్ అందించామని అన్నారు. 25 లక్షల మంది రైతులకు 21 వేల కోట్లను రూ. 2 లక్షల వరకు ఉన్న రైతుల రుణమాఫీ అమలు చేసి రైతులపై ఉన్న ఆర్థిక భారం తగ్గించామని వివరించారు. వ్యవసాయానికి అవసరమైన పరికరాలు, మద్దతు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం విస్తృతంగా అమలు చేస్తోందన్నారు. అర్హులైన కుటుంబాలకు 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నామని, కొత్త రేషన్ కార్డుల ద్వారా సన్నబియ్యం పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పేదల సొంతింటి కలను నిజం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. మొదటి విడతలో సుమారు నాలుగున్నర లక్షల ఇళ్లు, రెండో విడతలో రెండున్నర లక్షల ఇళ్లు మంజూరు చేశామని, ఇప్పటివరకు మొత్తం ఏడు లక్షల ఇళ్లను మంజూరు చేసినట్లు తెలిపారు. రెండో విడతలో ఇంకా మిగిలిన గ్రామాలకు ఇళ్లు మంజూరు చేయనున్నామని, మూడో, నాలుగో విడతల్లో కూడా అర్హులైన ప్రతి పేద కుటుంబానికి దశలవారీగా ఇందిరమ్మ ఇళ్లు అందిస్తామని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా అభివృద్ధి పనులు ఎక్కడా ఆగిపోకుండా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందని మంత్రి అన్నారు. గ్రామీణ రహదారులు, విద్యాసంస్థలు, త్రాగునీరు, మౌలిక వసతుల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తూ ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని తెలిపారు. ప్రజలకు ఇచ్చిన ప్రతి మాటను తూచా తప్పకుండా అమలు చేస్తామని ఆయన స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమాల్లో ఏదులాపురం మునిసిపాలిటీ చైర్ పర్సన్ పోకబత్తిని అనిత, ఖమ్మం ఆర్డీవో ఎన్. శ్రీనివాస్, హౌజింగ్ పిడి భూక్యా శ్రీనివాస్, పీఆర్ ఇఇ మహేష్ బాబు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

# ఆగస్టు 1లోగా ఎన్యుమరేషన్ ఫారాలు సమర్పించాలి

## – పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు

పెద్ద అంబర్‌పేట్ -- ప్రభాత సూర్యుడు:ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని, అర్హులైన ఓటర్లందరూ ఆగస్టు 1లోగా ఎన్యుమరేషన్ ఫారాలను సంబంధిత బీఎల్‌ఓలకు తప్పనిసరిగా అందజేయాలని ఈఆర్‌ఓ/ఆర్‌డీఓ వై. శ్రీనివాస్ రెడ్డి సూచించారు. బుధవారం తట్టి అన్నారం వార్డు కార్యాలయంలో వివిధ రాజకీయ పార్టీల బీఎల్‌ఏలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆగస్టు 3 నాటికి ప్రత్యేక సవరణ ప్రక్రియ పూర్తికానున్నందున ప్రజలు చివరి నిమిషం వరకు వేచి చూడకుండా వెంటనే తమ వివరాలను పరిశీలించి ఫారాలు సమర్పించాలని కోరారు. ఎన్యుమరేషన్ ఫారం సమర్పించని పక్షంలో ఓటు హక్కు కోల్పోయే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పెద్ద అంబర్‌పేట్, కుంట్లూరు డివిజన్ వార్డు కార్యాలయాల్లో ప్రత్యేక హెల్ప్ డెస్క్‌లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అర్హులైన ప్రతి ఓటరు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. ఈ సమావేశంలో ఏఈఆర్‌ఓ/ఏఎంసీ బి. కిరణ్ కుమార్, స్పెషల్ ఆఫీసర్ పి. రమేష్, బీఎల్‌ఓ సూపర్వైజర్లు, బీఎల్‌ఓలు, వివిధ రాజకీయ పార్టీల ప్రజాప్రతినిధులు, బీఎల్‌ఏలు పాల్గొన్నారు.



# లోతట్టు కాలనీల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు

ములుగు జూలై 29, ప్రభాత సూర్యుడు:ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని 4వ వార్డులో భారీ వర్షాల కారణంగా వర్షపు నీరు నిలిచిపోవడంతో, స్థానిక ప్రజలను అప్రమత్తం చేయడానికి మరియు తక్షణ సహాయక చర్యలు చేపట్టడానికి సర్పంచ్ కాకులమర్రి శ్రీలత లక్ష్మణ్ బాబు ఆ ప్రాంతాన్ని పరిశీలించి పరిస్థితిని సమీక్షించారు. వెంటనే స్పందించి గ్రామ పంచాయతీ జేసీబీని రప్పించి, నీరు బయటకు వెళ్లేలా ట్రెంచ్ కొట్టించారు. కరకట్ట గేట్లెత్తివేత ఇరిగేషన్ ఏఈ రాజుతో మాట్లాడి తక్షణమే కరకట్ట గేట్లు తెరిపించారు. లోతట్టు ప్రాంతాల నుండి నీరు పూర్తిగా తొలగిపోయే వరకు గేట్లు తెరిచి ఉంచాలని అధికారులను కోరారు. వర్షాకాలం ముగిసే వరకు ప్రజలందరూ కాచి చల్లార్చిన నీటిని మాత్రమే తాగాలని సూచించారు. కలుషిత నీటి వల్ల డయేరియా, టైఫాయిడ్, మలేరియా వంటి జ్వరాలు ప్రబలే అవకాశం ఉందని సర్పంచ్ గారు తెలిపారు. గ్రామ పంచాయతీ పరిధిలోని అన్ని వీధుల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లడంతో పాటు, దోమల నివారణ కోసం ఆయిల్ బాల్స్ వేసే కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు సభ్యులు రాజు, మధు, చిన్ని, బాబా, జీపీ సిబ్బంది మినాజ్, రాంబాబు, ప్రణయ్ పాల్గొన్నారు.





# సిపిఎం నేత నాగయ్య అరెస్టు

ఆత్మకూరు ప్రభాత సూర్యుడు:పొగాకు గిట్టుబాటు ధర కోసం సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో నేడు జాతీయ రహదారుల నిర్బంధాన్ని ప్రకటించి ఆ ప్రయత్నంలో ఉన్న సిపిఎం నేతలను ముందస్తుగా పోలీసులు అరెస్టు చేశారు.. అందులో భాగంగా ఆత్మకూర్ సిపిఎం పార్టీ నేత ఆత్మకూరు.నాగయ్యను ముందస్తుగా అదుపులోకి తీసుకుని నోటీసులు ఇచ్చారు.. పొగాకు రైతుల సంక్షేమం కోసం వారికి గిట్టు బాటు ధర కల్పించేందుకు తాము జాతీయ రహదారుల నిర్బంధాన్ని పిలుపునివ్వడంతో తమను అరెస్టు చేయడంపై రైతుల కోసం ఎంతైనాపోరాటం చేస్తామని ఇకనైనా ప్రభుత్వం పొగాకు రైతుల బాధలను గుర్తించి పొగాకు రైతులకు గిట్టుబాటు ధర కల్పిస్తూ న్యాయం చేయాలని ఈ సందర్భంగా ఆత్మకూరు.నాగయ్య తెలిపారు..



# భారీ వర్షాలు నేపథ్యంలో గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాలల విద్యార్థుల పట్ల హెచ్ఎంలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోండి

**ఐటీడీఏ పీవో బి రాహుల్**




భద్రాచలం జూలై 29ప్రభాత సూర్యుడు: రానున్న 36 గంటలు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున గిరిజన గ్రామాలలో మారుమూల ప్రాంత గిరిజనులందరూ అప్రమత్తంగా ఉండి ప్రత్యేక జాగ్రత్తలు తప్పనిసరిగా పాటించి మీ పిల్లలను వాగులు వంకల వైపు వెళ్లకుండా చూడాలని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.వాతావరణ శాఖ అధికారుల సూచనల మేరకు జిల్లాలో భారీ వర్షాలు కురుస్తున్నందున గిరిజన ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అన్నారు. గోదావరి వరదల ముంపునకు గురి అయ్యే ప్రాంతాలలో నివసిస్తున్న గిరిజన ప్రజలు, ఆశ్రమ పాఠశాలలోని విద్యార్థినీ విద్యార్థులను ముందస్తుగా అప్రమత్తంగా ఉంచాలని, భారీ వరద ప్రవాహ సమయంలో నదులు, కాలువలు, చెరువులు వంటి ప్రాంతాలకు వెళ్లకూడదని, వాటిని దాటేందుకు ప్రయత్నించరాదని అన్నారు. అలాగే రహదారులు, కల్వర్టులపై నీరు ప్రవహిస్తున్న చోట్ల కూడా దాటడానికి సాహసించకూడదని,తాగునీరు కలుషితమయ్యే అవకాశం ఉన్నందున గిరిజనులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోని కాచి వడబోసిన మంచినీటినే తాగాలని, పరిసరాల ముందు నిలువ నీరు ఉండకుండా చూసుకోవాలని, విద్యుత్ సరఫరా నిలిచిన సందర్భంలో ఆసుపత్రుల్లో అత్యవసర సేవలకు ఆటంకం కలగకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారులు చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రసవం సమీపించిన గిరిజన గర్భిణీలను ముందుగానే ఆసుపత్రులు లేదా గర్భిణీల వసతి కేంద్రాలకు తరలించాలని అన్నారు. గిరిజన సంక్షేమ శాఖ ఆశ్రమ పాఠశాల, వసతి గృహాలలో చదువుతున్న గిరిజన విద్యార్థినీ విద్యార్థుల పట్ల హెచ్ఎం వార్డెన్లు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని, పిల్లలు ఎవరు వారి ఇన్స్టిట్యూషన్ పరిధిలోని వాగులు వంకలకు వెళ్లకుండా చూడాలని మరియు ఇన్స్టిట్యూషన్లలో పరిశుభ్రత పాటించి విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు.

# పరిమి వెంకయ్య దశదినకర్మలో జర్నలిస్టుల నివాళి

**కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి**

కూకట్‌పల్లి, జూలై 29 ప్రభాత సూర్యుడు: కూకట్‌పల్లి నియోజకవర్గం కేపీహెచ్‌బీ కాలనీ రోడ్ నంబర్--3లో నివాసముంటున్న పీవీ రమణ తండ్రి, స్వర్గీయ పరిమి వెంకయ్య దశదినకర్మ కార్యక్రమం బుధవారం కుటుంబ సభ్యులు,



బంధుమిత్రుల సమక్షంలో నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ ఫెడరేషన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు కట్టెల మల్లేశం, ఉపాధ్యక్షుడు వంగాల కొండల్‌రెడ్డి, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు మహేందర్, కూకట్‌పల్లి అధ్యక్షుడు ఎర్ర యాకయ్య తదితరులు వెంకయ్య చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి నివాళులర్పించారు. అనంతరం ఆయన ఆత్మకు శాంతి చేకూరాలని ప్రార్థించి, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ కూకట్‌పల్లి జనరల్ సెక్రటరీ నాగుల అంజిబాబు, ఆర్గనైజింగ్ సెక్రటరీ నాగార్జున, ఈసీ సభ్యురాలు సుజాత, అనిల్ కిషోర్, శివ, రామకృష్ణ, బి. శ్రీధర్, జి. శ్రీధర్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# వన్యప్రాణి రక్షణ మన బాధ్యత. ఎఫ్ ఆర్ వో శ్రీనివాసరావు

**జూనియర్ కళాశాలలో అటవీశాఖ ఆధ్వర్యంలో టైగర్స్ డే.**

సింగరేణి జులై 29 ప్రభాత సూర్యుడు: కారేపల్లి ప్రభుత్వ జూనియర్




కళాశాలలో బుధవారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ అటవీశాఖ కారేపల్లి రేంజ్ ఆధ్వర్యంలో అంతర్జాతీయ టైగర్స్ డే సెలబ్రేషన్స్ జరుపుకున్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు పాల్గొన్నారు. ఫారెస్ట్ కార్యాలయం నుండి జూనియర్ కళాశాల వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటి అధికారులు, విద్యార్థిని విద్యార్థులు అంతర్జాతీయ టైగర్స్ డే ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా ఎఫ్ఆర్ఓ శ్రీనివాసరావు మాట్లాడుతూ అడవుల నరికివేత వేటగాళ్ల ముప్పు నుండి పూలలను రక్షించడం మన బాధ్యత అని తెలిపారు. టైగర్స్ డే ముఖ్య ఉద్దేశం వేటగాళ్ల దాడుల వల్ల, అడవుల నరికివేత వల్ల క్షమించకుండా రక్షించడం వాటి సహజ ఆవాసాలను రక్షించడం ఈ అంతర్జాతీయ డే ఉద్దేశమని అన్నారు.

# వర్షాకాల ఇబ్బందులు లేకుండా ముందస్తు చర్యలు చేపట్టాలి

**వాటర్‌లాగింగ్ ప్రాంతాల్లో సీపీ రమేష్ క్షేత్రస్థాయి పరిశీలన**

సైబరాబాద్, జూలై 29 ప్రభాత సూర్యుడు:: వర్షాకాలంలో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు ఎదుర్కోకుండా



ముందస్తు చర్యలను వేగవంతం చేయాలని సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్ సంబంధిత అధికారులను ఆదేశించారు. వాటర్‌లాగింగ్ సమస్యలను శాశ్వతంగా పరిష్కరించే దిశగా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. రాయదుర్గం పోలీస్ స్టేషన్ పరిధిలోని మల్కంచెరువు, సిటీ వైన్స్ వాటర్‌లాగింగ్ ప్రాంతాలను సీపీ సంబంధిత సివిక్ బాడీ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అలాగే మాదాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సెంటర్ ఫర్ ఆర్గనైజేషన్ డెవలప్‌మెంట్ (సీఓడీ) పైప్‌లైన్ పనుల పురోగతిని సమీక్షించారు.వర్షపు నీరు నిలిచిపోవడానికి గల కారణాలను అధికారులు వివరించగా, నీటి ప్రవాహానికి అడ్డంకులను తొలగించి,



డ్రైనేజీ వ్యవస్థ సామర్థ్యాన్ని పెంచేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. పనులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసి ప్రజలకు, వాహనదారులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఆదేశించారు.సీఓడీ పైప్‌లైన్ పనులను వేగవంతం చేయడంతో పాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో భద్రతా ప్రమాణాలు పాటించాలని, అవసరమైన ట్రాఫిక్ మళ్లింపులపై ప్రజలకు ముందుగానే సమాచారం అందించాలని స్పష్టం చేశారు. ఈ పరిశీలనలో సైబరాబాద్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ (ట్రాఫిక్) సన్‌ప్రీత్ సింగ్, సీఎంసీ కమిషనర్ సృజన, శేరిలింగంపల్లి ట్రాఫిక్ ఏడీసీపీ హనుమంతరావు, మాదాపూర్ ట్రాఫిక్ ఏసీపీ చంద్రశేఖర్ రెడ్డి, సీఎంసీ డిప్యూటీ కమిషనర్, ఏఈ/ఏఈఈ అధికారులు, హైడ్రా సిబ్బంది, ఇతర సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రానున్న రెండు రోజులు భారీ వర్షాల సూచన.

**ముందస్తు చర్యలతో అధికారులు సన్నద్ధంగా ఉండాలి**
**అత్యవసర సమాచారం కోసం టోల్ ఫ్రీ నంబర్: 1800 425 7109**
**కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు**

ములుగు జూలై 29, ప్రభాత సూర్యుడు: ములుగు జిల్లా లో జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు వారు వాతావరణ శాఖ భారీ వర్షాల హెచ్చరికల నేపథ్యంలో జిల్లా అధికారులతో, అన్ని మండలాల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, నీటిపారుదల శాఖ అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి జిల్లాలో చేపట్టాల్సిన ముందస్తు చర్యలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపిఓలు, నీటిపారుదల శాఖ అధికారులు తప్పనిసరిగా తమ ప్రధాన కార్యాలయాల్లోనే అందుబాటులో ఉండి పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. భారీ వర్షాల కారణంగా వాగులు, వంకలు, చెరువులు పొంగిపొర్లే అవకాశం ఉన్నందున ప్రజలు అత్యంత అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సూచించారు.



అత్యవసరం అయితే తప్ప వరద నీటిలోకి వెళ్లవద్దని, వాగులు, వంకలు దాటేందుకు ప్రయత్నించవద్దని, ప్రమాదకర ప్రాంతాలకు దూరంగా ఉండాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు అధికారుల సూచనలను తప్పనిసరిగా పాటించాలని కోరారు. రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడడం, నీటిమునిగిన ప్రాంతాలు ఏర్పడడం లేదా ఇతర అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకున్నట్లయితే సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అవసరమైతే ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు ముందుగానే సిద్ధంగా ఉంచాలని సూచించారు. జిల్లాలో భారీ వర్షాల నేపథ్యంలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు, వరదలు, రహదారులు దెబ్బతినడం, చెట్లు కూలిపోవడం, నీటిమునిగిన ప్రాంతాలు ఏర్పడడం లేదా ప్రజలకు ఇబ్బందులు కలిగే ఇతర ఘటనలు చోటుచేసుకున్నట్లయితే వెంటనే జిల్లా ఫ్లడ్ కంట్రోల్ రూమ్ కు సమాచారం అందించాలని కోరారు. ప్రజలు 24 గంటల పాటు అందుబాటులో ఉండే టోల్ ఫ్రీ నంబర్ 1800 425 7109కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపారు. అందిన సమాచారంపై సంబంధిత శాఖల అధికారులు తక్షణమే స్పందించి అవసరమైన సహాయక చర్యలు చేపడతారని పేర్కొన్నారు.

# ములుగు జిల్లా ప్రజలు అధికారులు అప్రమత్తంగా ఉండాలి.

**చీకుపల్లి పెద్ద గొల్లగూడెం ఇసుక వాగు రోడ్డు పరిస్థితిని**
**పరిశోలించిన జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు**

ములుగు జూలై 29,ప్రభాత సూర్యుడు: జిల్లాలోని మూడు రోజులు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు



అధికారులు అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు తెలిపారు. బుధవారం వాజేడు మండలంలోని చీకుపల్లి పెద్ద గొల్లగూడెం ఇసుక వాగు డ్రైవర్సన్ రోడ్ పరిస్థితిని జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు పరిశీలించి రహదారి పూనమ్ నిర్మాణానికి తక్షణమే చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులు ఆదేశించారు. వాజేడు మండలాల పరిధిలో చీకుపల్లి పెద్ద గొల్లగూడెం గ్రామాల మధ్య ఇసుక వాగు పై నిర్మాణంలో ఉన్న వంతెనను వద్ద ఏర్పాటుచేసిన డ్రైవర్ను మంగళవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు వరద నీరు రావడంతో తాత్కాలికంగా ఏర్పాటు చేసిన డ్రైవర్స్ అండ్ రోడ్ను దెబ్బ తినడంతో తెలంగాణ చతిస్గడ్ రాష్ట్రాలను అనుసంధానించే జాతీయ రహదారి 163 పై వాహనాలకు తాత్కాలికంగా నిలపడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ హేమంత్ సహదేవరావు వరద ప్రవాహం తగ్గినా అనంతరం రహదారి నీ అత్యవసరంగా పునందరించి రాకపోకలను పునర్దరించేందుకు చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అవసరమైన అన్ని జాగ్రత్తలకు తీసుకోవాలని ప్రమాదాలు జరగకుండా పోలీస్ శాఖ, రెవిన్యూ పంచాయతీరాజ్ శాఖలను సమన్వయతో నిరంతర పరివేక్షణలో



కొనసాగించాలని సూచించారు. ప్రస్తుత వరద నీరు ఉత్పత్తి అధికంగా ఉండడంతో పైపులు దెబ్బ తినకుండా డైవర్షన్ రోడ్డుకు ఇరువైపుల కాలవాలు తవ్వి నీటిని మళ్లిస్తున్నట్లు తెలిపారు. ప్రవాహం తగ్గిన వెంటనే రోడ్ను తిరిగి వినియోగంలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపడుతున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ములుగు జిల్లా ఎస్పీ సుధీర్ రామాధ్ కేకన్, ఐటిడిఏ పి. ఓ లెనిన్ వతసల్ టోపో, ఏటూరు నాగారం ఏఎస్పీ మనన్ బట్, తాసిల్దారు శ్రీనివాస్, ఎంపీడీవో కొండా కృపాకర్ సంబంధిత శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# నిరుద్యోగ గిరిజన యువతి యువకులకు వృత్తి నైపుణ్యాల శిక్షణ

**ఐటీడీఏ పీవో బి.రాహుల్**

భద్రాచలం జులై 29 ప్రభాత సూర్యుడు:గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులకు భద్రాచలం ఐటిడిఏ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న్ ూజ శిక్షణా



కేంద్రంలో 18 నుండి 33 సంవత్సరాల వయస్సు గల ఎస్టీ యువతీ, యువకులకు మాత్రమే ఉచిత శిక్షణ అందించి ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి బి రాహుల్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జావా, పైతాన్, స్పోకెన్ ఇంగ్లీష్ అండ్ సాఫ్ట్ స్కిల్స్,బ్యూటీషియన్ కోర్సు, సెల్ఫ్ ఎంప్లాయ్ టైలర్ సీట్లు మిగిలి ఉన్నాయని ఉచిత భోజనం ఒ వసతి శిక్షణ అనంతరం ఎన్ ఎస్ డి సి గుర్తింపు పొందిన సర్టిఫికెట్, ఉపాధి అవకాశాలు కల్పించడం జరుగుతుందని ఆయన అన్నారు. ఆసక్తిగల గిరిజన నిరుద్యోగ యువతీ, యువకులు ఆగస్ట్ 07వ తేదీ లోగా తమ లగేజ్‌తో నేరుగా ూజ శిక్షణా కేంద్రానికి వచ్చి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రిజిస్ట్రేషన్ పూర్తయిన వెంటనే తరగతులు ప్రారంభమవుతాయని ఆయన తెలుపుతూ మరిన్ని వివరాల కొరకు 7993102529 అని మెసేజ్ పంపవచ్చునని లేదా ఫోన్ ద్వారా సంప్రదించి వివరాలు తెలుసుకోవాలని ఆయన అన్నారు.సీట్లు పరిమితంగా ఉన్నాయని వెంటనే నమోదు చేసుకొని ఈ అరుదైన అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

# ఎలివేటెడ్ కారిడార్‌కు భూసేకరణ ప్రక్రియ తుది దశలో

**అల్వాల్‌లో గజానికి రూ.1.10 లక్షల పరిహారం..**
**నెలన్నరలో చెల్లింపులకు చర్యలు**



మేడ్చల్ మల్కాజ్‌గిరి కలెక్టరేట్ జూలై 29 ప్రభాత సూర్యుడు: సికింద్రాబాద్ నుంచి శామీర్‌పేట్ వరకు శరవేగంగా నిర్మిస్తున్న ప్రతిష్టాత్మక ఎలివేటెడ్ కారిడార్ పనులు మేడ్చల్--మల్కాజ్‌గిరి జిల్లాలో వేగంగా కొనసాగుతున్నాయి. ప్రాజెక్టు పరిధిలోకి వచ్చే ఐదు గ్రామాలకు సంబంధించిన భూసేకరణ ప్రక్రియ దాదాపు పూర్తికావచ్చింది. ఇప్పటికే పోతాయిపల్లి, లోతుకుంట, తూంకుంట గ్రామాల్లో భూసేకరణ ప్రక్రియ పూర్తయింది. చివరిగా అల్వాల్ గ్రామానికి సంబంధించిన భూసేకరణకు సంబంధించి జిల్లా స్థాయి భూసేకరణ కమిటీ (డీఎల్ఎన్‌సీ) సమావేశంలో పరిహార ధరను గజానికి రూ.1,10,000గా నిర్ణయించారు. ఈ నిర్ణయంపై భూ యజమానులు సంతృప్తి, హర్షం వ్యక్తం చేశారు. అల్వాల్ గ్రామంలో భూసేకరణ ప్రక్రియ కూడా తుది దశకు చేరుకోవడంతో పరిహారం చెల్లింపులపై అధికారులు దృష్టి సారించారు. వచ్చే నెల నుంచి నెలన్నరలోగా అర్హులైన భూ యజమానులందరికీ పరిహారం మొత్తాన్ని చెల్లించేలా చర్యలను వేగవంతం చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

# ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ వితరణ.

**దాతను సన్మానించిన సర్పంచ్ ఉమా.**



సింగరేణి జులై 29 ప్రభాత సూర్యుడు: సింగరేణి మండల పరిధిలోని మాదారం గ్రామపంచాయతీలో సర్పంచ్ ఉమా చర్వత దాతల సహాయంతో మాదారం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ ఏర్పాటు చేశారు. ఫ్రిడ్జ్ డొనేషన్ దాత కిలారి వెంకటేశ్వర్లు దంపతులు అందించారు. ఫ్రిడ్జ్ డొనేషన్ చేసినందుకు దంపతులను సర్పంచ్ ఉమా శాలువాతో సన్మానించారు. కిలారి వెంకటేశ్వర్లు దంపతులు మాట్లాడుతూ..గ్రామపంచాయతీలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి ఫ్రిడ్జ్ డొనేషన్ చేయడం పట్ల సంతృప్తి ఉందని సర్పంచ్ ఉమా చొరవతో ఫ్రిడ్జ్ అందించడం జరిగిందని తెలిపారు.

**సర్పంచ్ ఉమా మాట్లాడుతూ...**

గ్రామపంచాయతీ ప్రజల ఆరోగ్యం పట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫ్రిడ్జ్ డొనేషన్ దాత సహాయంతో ఏర్పాటు చేయడం జరిగిందని, గ్రామంలో ప్రమాద సంఘటనలు ఎదురైనప్పుడు టీ.కా వ్యాక్సిజన్ అందుబాటులో లేక ప్రజలు ఇబ్బందులు పడుతున్న తరుణంలో తన దృష్టికి రావడంతో దాత సహాయంతో అందుబాటులోకి ఫ్రిడ్జ్ రావడం వల్ల ఆరోగ్య కేంద్రంలోని వైద్య సదుపాయం అందుతుందని తెలిపారు. అనంతరం గ్రామ అభివృద్ధిలో మెరుగైన సేవలు అందిస్తానని తెలిపారు.



# ‘రామాయణం’ తర్వాత మరో మైథాలజీ.. సాయి పల్లవి కొత్త ప్రాజెక్ట్ ఫిక్స్!

సినిమా ఇండస్ట్రీలో సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఏకైక నటి సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో సౌత్ నుంచి నార్త్ వరకు అగ్ర హీరోయిన్‌గా దూసుకుపోతోంది.



సినిమా ఇండస్ట్రీలో సింప్లిసిటీకి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే ఏకైక నటి సాయి పల్లవి. గ్లామర్ పాత్రలకు దూరంగా ఉండి, నటనకు ప్రాధాన్యమున్న పాత్రలతో సౌత్ నుంచి నార్త్ వరకు అగ్ర హీరోయిన్‌గా దూసుకుపోతోంది. త్వరలో ‘రామాయణం’లో సీతగా కనిపించనున్న ఈ సహజ నటి, మరో మైథాలజీ సినిమాకు కూడా ఓకే చెప్పినట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది. వివరాలు చూద్దాం.. ప్రత్యేకమైన పాత్రలతో సరికొత్త ట్రెండ్: ఇండస్ట్రీలో చాలామంది హీరోయిన్లకు తమ వర్సటాలిటీని నిరూపించుకునే అవకాశాలు తక్కువగా వస్తుంటాయి. కానీ సాయి పల్లవి మాత్రం కథల ఎంపికలో సరికొత్త ట్రెండ్ సెట్ చేస్తోంది. ఇక మీడియం రేంజ్ హీరోల నుంచి పాన్ ఇండియా సినిమాల వరకు, నటనకు స్కోప్ ఉన్న పాత్రలనే ఎంచుకుంటూ ప్రేక్షకుల మనసుల్లో చెరగని ముద్ర వేసింది. ఇప్పుడు సౌత్ నుంచి నార్త్ వరకు బిజీ హీరోయిన్‌గా మారింది.ప్రస్తుతం ఆడియన్స్ అందరూ ఈ దీపావళికి థియేటర్లలోకి రాబోతున్న ‘రామాయణం’ సినిమా కోసం తీవ్ర ఆత్రుతగా ఎదురుచూస్తున్నారు. ఇక ఇందులో సీతమ్మ పాత్రలో సాయి పల్లవి కనిపించబోతోంది. ఈ బాలీవుడ్ విజువల్ వండర్‌లో ఆమె పర్ఫార్మెన్స్ ఎలా ఉండబోతోందో అని దేశవ్యాప్తంగా ఉన్న సినీ అభిమానులు చాలా ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. ‘తండేల్’ తర్వాత మరో తెలుగు ప్రాజెక్ట్: తెలుగులో ‘తండేల్’ సినిమా తర్వాత సాయి పల్లవి కొత్తగా ఏ ప్రాజెక్ట్‌కూ సంతకం చేయలేదు. దీంతో ఆమె తదుపరి తెలుగు సినిమా ఏదోనని ఫ్యాన్స్‌లో ఆసక్తి పెరిగింది. అయితే తాజాగా దర్శకుడు కిషోర్ తిరుమల ఆమెకు ఒక పవర్‌ఫుల్ కథ చెప్పినట్లు తెలుస్తోంది. ఇక ‘అమ్మోరు’ తరహా కథాంశంతో సాగే ఒక మైథాలాజికల్ కథకు సాయి పల్లవి వెంటనే గ్రీన్ సిగ్నల్ ఇచ్చినట్లు టాక్ వినిపిస్తోంది.క్యూలో ఉన్న సౌత్ ప్రాజెక్టులు: ఒకవైపు మణిరత్నం దర్శకత్వంలో విజయ్ సేతుపతికి జోడీగా ఒక సినిమా, అలాగే ధనుష్‌తో ‘ఓమ్’ అనే తమిళ చిత్రంలో నటిస్తూ సాయి పల్లవి బిజీగా ఉంది. ఇక ఈ కమిట్‌మెంట్స్ పూర్తి కాగానే కిషోర్ తిరుమల దర్శకత్వంలో తెరకెక్కే ఈ భారీ మైథాలజీ సినిమా పట్టాలెక్కే అవకాశం ఉందని ఫిల్మ్ నగర్ వర్గాలు చెబుతున్నాయి. ‘రామాయణం’ తర్వాత సాయి పల్లవి కెరీర్‌లో రాబోతున్న వరుసగా రెండో మైథాలాజికల్ ఫిల్మ్ ఇది కావడం విశేషం. దేవుళ్ల కథ నేపథ్యం, భారీ బడ్జెట్‌తో తెరకెక్కే ఇలాంటి చిత్రాలలో సాయి పల్లవి తనదైన నటనతో ఎలాంటి మ్యాజిక్ క్రియేట్ చేస్తుందో చూడాలి. ఈ వార్త నిజమైతే సాయి పల్లవి ఫ్యాన్స్‌కు పండుగే అని చెప్పాలి

# బన్నీ ఫ్యాన్స్‌కు పండగ.. ‘రాకా’ చివరి షెడ్యూల్‌కు గ్రీన్ సిగ్నల్!



ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ‘రాకా’. ఐకాన్ స్టార్ అల్లు అర్జున్, సెన్సేషనల్ డైరెక్టర్ అట్లీ కాంబోలో రాబోతున్న మోస్ట్ అవైటెడ్ పాన్ ఇండియా మూవీ ‘రాకా’. ఈ సినిమాపై ఇప్పటికే అభిమానుల్లో, సినీ ప్రియుల్లో అంచనాలు ఆకాశాన్ని తాకుతున్నాయి. కొద్దిరోజుల విరామం తర్వాత, ఇప్పుడు ఈ మూవీ షూటింగ్ మళ్లీ మొదలుకాబోతోంది. ఆగస్టు మొదటి వారంలో ఈ సినిమా తదుపరి షెడ్యూల్‌ను ప్రారంభించడానికి బన్నీ సిద్ధమవుతున్నారు. ఈ లేటెస్ట్ అప్‌డేట్‌తో అల్లు అర్జున్ ఫ్యాన్స్ ఫుల్ ఖుష్ అవుతున్నారు. ఆ విశేషాలు చూద్దాం.. గత కొంతకాలంగా కాస్త బ్రేక్ పడిన ‘రాకా’ షూటింగ్ ఇప్పుడు మళ్లీ పరుగులు పెట్టనుంది. ఆగస్టు మొదటి వారం నుంచి తదుపరి షెడ్యూల్ షురూ కాబోతోంది. ఇక ఈ ఏడాది చివరినాటికి షూటింగ్ మొత్తాన్ని ఎలాగైనా పూర్తి చేయాలని చిత్ర బృందం పక్కా ప్లాన్‌తో ముందుకు వెళ్తోంది. ఈ వార్త నెట్టింట వైరల్ అవ్వడంతో బన్నీ అభిమానులు సోషల్ మీడియాలో సందడి చేస్తున్నారు. క్లైమాక్స్.. బన్నీ వైల్డ్ లుక్: ఫిలిం నగర్ సమాచారం ప్రకారం, ఆగస్టులో మొదలయ్యేది దాదాపు ఈ సినిమా చివరి షెడ్యూల్ కానుంది. దీనికోసం మేకర్స్ ఒక భారీ సెట్ కూడా నిర్మించారట. అంతేకాకుండా, ఈ షెడ్యూల్‌లో తీయబోయే సీన్స్ కోసం అల్లు అర్జున్ ఒక వైల్డ్ లుక్‌లో కనిపించబోతున్నారని తెలుస్తోంది. ఇక అట్లీ మార్క్ మాస్ ఎలివేషన్లు, అద్భుతమైన యాక్షన్ సీక్వెన్సులు ఈ సినిమాలో ప్రేక్షకులను కట్టిపడేస్తాయని సమాచారం. ముగ్గురు భామలతో బన్నీ రొమాన్స్: ఈ భారీ ప్రాజెక్టులో గ్లామర్ డోస్ కూడా గట్టిగానే ఉండబోతోంది. అల్లు అర్జున్ సరసన బాలీవుడ్ బ్యూటీ దీపికా పదుకొణె ప్రధాన కథానాయికగా నటిస్తోంది. ఆమెతో పాటు మరో ఇద్దరు క్రేజీ హీరోయిన్లు మృణాల్ ఠాకూర్, జాన్వీ కపూర్ కూడా ముఖ్య పాత్రల్లో అలరించనున్నారు. ఇక ఈ ఇగ్నైటింగ్ కాంబినేషన్ సినిమాపై మరింత కుతూహలాన్ని పెంచుతోంది. మాఫియా బ్యాక్‌డ్రాప్‌లో భారీ బడ్జెట్: ఈ చిత్రాన్ని ప్రముఖ నిర్మాణ సంస్థ ‘సన్ పిక్చర్స్’ అత్యంత భారీ బడ్జెట్‌తో నిర్మిస్తోంది. ఓ పవర్‌ఫుల్ మాఫియా డాన్ చుట్టూ ఈ కథ సాగుతుందని టాక్. ఇక కథా నేపథ్యం, మాఫియా బ్యాక్‌డ్రాప్ కావడంతో యాక్షన్ ఎపిసోడ్స్ నెక్స్ట్ లెవెల్‌లో ఉంటాయని ఇన్సైడ్ వర్గాలు చెబుతున్నాయి. పుష్ప క్రేజ్ తర్వాత అల్లు అర్జున్ నుంచి వస్తున్న సినిమా కావడం, అట్లీ దర్శకత్వం వహించడం ఈ సినిమాపై అంచనాలను ఎక్కడికో తీసుకెళ్లింది. త్వరలోనే చివరి షెడ్యూల్ పూర్తి చేసుకుని విడుదల తేదీకి సిద్ధం కానున్న ‘రాకా’ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి రికార్డులు క్రియేట్ చేస్తుందో చూడాలి.

# అల్లు ఫ్యాన్స్ మీట్ -2026 : ఐకాన్ స్టార్ ఉదారత గురించే దేశవ్యాప్తంగా చర్చ

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నటనతోనే కాకుండా.. తన ఉదార స్వభావంతోనూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాలను గెలుచుకుంటున్నారు.ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ తన నటనతోనే కాకుండా.. తన ఉదార స్వభావంతోనూ ప్రపంచవ్యాప్తంగా కోట్లాది మంది హృదయాలను గెలుచుకుంటున్నారు. బ్లాక్‌బస్టర్ -పుష్ప- చిత్రం తర్వాత దేశవ్యాప్తంగా అపూర్వమైన ప్రజాదరణ, పాన్-ఇండియా స్టార్‌డమ్ సొంతం చేసుకున్న బన్ని.. తనపై ప్రేమాభిమానాలు కురిపించే అభిమానుల సంక్షేమం కోసం మరోసారి ముందుకొచ్చారు. తాజాగా నిర్వహించిన ూూఖీూ వార్షిక సమావేశం- 2026 వేదికగా తన అధికారిక అభిమానుల సంఘం- అల్లు అర్జున్ ఫ్యాన్స్ అసోసియేషన్ సభ్యుల కోసం ప్రత్యేక -ఇన్సూరెన్స్ కవరేజ్- సంక్షేమ పథకాన్ని ఆవిష్కరించి తన పెద్ద మనసును చాటుకున్నారు తన అభిమానులను నేరుగా కలిసి వారి సంక్షేమ కార్యక్రమాలను సమీక్షించేందుకు అల్లు అర్జున్ ఈ ఏఏఎఫ్ఏ వార్షిక సదస్సును ప్రత్యేకంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాలైన ఆంధ్రప్రదేశ్, తెలంగాణలతో పాటు కర్ణాటక, కేరళ, తమిళనాడు, మహారాష్ట్ర, ఒడిశా వంటి పలు పొరుగు రాష్ట్రాల నుంచి కూడా అభిమాన సంఘాల నాయకులు, ప్రతినిధులు, సభ్యులు భారీగా తరలివచ్చారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన దాదాపు 900 మంది అభిమానులతో ప్రాంగణమంతా సందడి వాతావరణం నెలకొంది.ఈ కార్యక్రమంలో అల్లు అర్జున్ కేవలం అతిథిగా వచ్చి వెళ్లడమే కాకుండా..తన సమయాన్ని పూర్తిగా అభిమానులకే కేటాయించారు. సుమారు 4 నుంచి 5 గంటల పాటు ఓపికగా వేదికపైనే ఉంటూ.. వచ్చిన ప్రతీ ఒక్కరితో



ముచ్చటించారు. అభిమానులతో సరదాగా మాట్లాడుతూ వారందరితో కలిసి ఫోటోలు దిగారు. అభిమానులతో తనకు ఉన్న ఈ విడదీయరాని ప్రేమానుబంధం, ఆత్మీయ కలయిక అక్కడ ఉన్న వారందరినీ ఎంతగానో ఆకట్టుకుంది. ఇక వచ్చిన అభిమానుల కోసం బన్ని చేసిన ఏర్పాట్లు అందరినీ మైమరపించాయి. స్వయంగా అభిమానులందరికీ కడుపునిండా భోజనం వడ్డించడంతో పాటు.. వారికి గుర్తుండిపోయేలా ప్రత్యేకమైన పోర్ట్రెయిట్ ఫోటోలను బహుమతులుగా అందించారు. కేవలం రీల్ లైఫ్‌లోనే కాకుండా రియల్ లైఫ్‌లోనూ తాను --బంగారు మనసున్న సూపర్ స్టార్-- అని.. తనపై అభిమానులు చూపే నిరపేక్షమైన ప్రేమకు ఏదీ సాటి రాదని ఈ సందర్భంగా ఆయన మరోసారి నిరూపించారు. ఇకపై ప్రతి ఆరు నెలలకు ఒకసారి బన్ని తన అభిమానులను కలవనున్నారని సమాచారం. సినిమా ఇండస్ట్రీలో ఏ హీరో చేయని విధంగా తన అభిమానుల భవిష్యత్తుకు, వారి కుటుంబాలకు రక్షణగా నిలిచేలా హెల్త్-లైఫ్ ఇన్సూరెన్స్ పాలసీని ఆవిష్కరించడం ఒక అరుదైన, విశిష్టమైన అడుగుగా నిలిచింది. అభిమానుల కోసం ఆలోచించి ఇంత గొప్ప సంక్షేమ కార్యక్రమాన్ని చేపట్టిన అల్లు అర్జున్ ఉదారతపై సోషల్ మీడియా వేదికగా దేశవ్యాప్తంగా ప్రశంసల వర్షం కురుస్తోంది. రీల్ హీరోగా మాత్రమే కాదు.. రియల్ హీరోగానూ ఆయన అందరి హృదయాల్లో చెరగని ముద్ర వేస్తున్నారు.


# భోగి ఎఫెక్ట్... సంపత్ నందికి శర్వా మరో ఆఫర్..?

‘నారీ నారీ నడుమ మురారి’, ‘బైకర్’ చిత్రాలతో మంచి ఫామ్‌లోకి వచ్చిన శర్వానంద్, ప్రస్తుతం సంపత్ నంది దర్శకత్వంలో ‘భోగి’ అనే హై-వోల్టేజ్ మాస్ ఎంటర్‌టైనర్ చేస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవల ఈ సినిమా రఫ్ కట్‌ను శర్వానంద్ వీక్షించాడట. ఫైనల్ అవుట్‌పుట్ చూసిన ఆయన సంతోషం వ్యక్తం చేశాడట. అంతేగాక, సంపత్ నంది టేకింగ్ మరియు వర్క్ పట్ల శర్వా ఫుల్ హ్యాపీగా ఉన్నాడట. సంపత్ వర్కింగ్ స్టైల్‌కి



బాగా ఇంప్రెస్ అయిన శర్వా, ‘భోగి’ విడుదలైన తర్వాత ఆయనతో మరొక సినిమా చేయడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చేశాడట. తాము కమిట్ అయిన ప్రాజెక్టులు పూర్తయ్యాక ఈ కాంబినేషన్ మళ్లీ పట్టాలెక్కనుంది.కె.కె. రాధామోహన్ నిర్మాణంలో తెరకెక్కుతున్న ‘భోగి’ చిత్రంలో అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయతి హీరోయిన్లుగా నటిస్తున్నారు. ఈ చిత్రాన్ని మొదట ఆగస్టు 28న విడుదల చేయాలని భావించినప్పటికీ, షూటింగ్ బ్యాలెన్స్ ఉండటంతో విడుదల తేదీని వాయిదా వేశారు. టాకీ పార్ట్ మరియు మిగిలిన చిత్రీకరణ పూర్తయిన తర్వాత కొత్త రిలీజ్ డేట్‌ను మేకర్స్ అధికారికంగా ప్రకటించనున్నారు.


# రామాయణ : రిలీజ్‌కు ముందే టార్గెట్.. ఎంతో తెలుసా..?




నితీష్ తివారీ దర్శకత్వంలో రణ్‌బీర్ కపూర్, సాయి పల్లవి, యష్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న మైథలాజికల్ చిత్రం ‘రామాయణ’ విడుదలకు ముందే సరికొత్త రికార్డులను సృష్టిస్తోంది. ఆస్కార్ విజేతలు ఏఆర్ రెహమాన్, హన్స్ జిమ్మెర్ కాంబినేషన్‌లో వస్తున్న ఈ సినిమా ఆల్ లాంగ్వేజ్ మ్యూజిక్ రైట్స్ కోసం సోనీ మ్యూజిక్ రూ.70 కోట్లు, టీ-సిరీస్ రూ.60 కోట్ల మేర బిడ్స్ వేయగా, నిర్మాత నమిత్ మల్హోత్రా మాత్రం రూ.100 కోట్లకు డీల్ ముగించాలని భావిస్తున్నారట.ఇది వర్కవుట్ అయితే రణ్‌వీర్ సింగ్ ‘ధురంధర్: ది రివేంజ్’ పేరిట ఉన్న రూ.54 కోట్ల రికార్డు తుడిచిపెట్టుకుపోనుంది. ఇప్పటికే విదేశీ మార్కెటింగ్ కోసం సోనీ పిక్చర్స్‌తో కుదుర్చుకున్న ఒప్పందంతో పాటు మొత్తం గ్లోబల్ ప్రమోషన్స్ బడ్జెట్‌ను మేకర్స్ రూ.375 కోట్లకు పెంచారు. నాన్-థియేట్రికల్ హక్కుల ద్వారానే భారీగా రికవరీ చేయాలని భావిస్తున్నారు. రణ్‌బీర్, యష్ అభిమానులు ఎంతగానో ఎదురుచూస్తున్న ఈ భారీ విజువల్ వండర్ 2026 దివాళీ కానుకగా ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలో విడుదల కానుంది.

# గ్లింప్స్‌తో మొదలైన మ్యాజిక్.. ఫస్ట్ సింగిల్ తో నెక్స్ట్ లెవెల్‌కు

ఒక సినిమా గురించి ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ పెంచాలంటే కేవలం భారీ యాక్షన్ సీన్స్ లేదా స్టార్‌డమ్ మాత్రమే సరిపోదు.ఒక సినిమా గురించి ఆడియన్స్ లో ఇంట్రెస్ట్ పెంచాలంటే కేవలం భారీ యాక్షన్ సీన్స్ లేదా స్టార్‌డమ్ మాత్రమే సరిపోదు. కథలోని ఎమోషన్స్ ను ఆడియన్స్ కు ముందుగానే పరిచయం చేస్తే ఆ సినిమాపై సహజంగానే ఒక బాండింగ్ ఏర్పడుతుంది. ప్రస్తుతం దుల్కర్ సల్మాన్ నటిస్తున్న ఆకాశంలో ఒక తార ప్రమోషన్లను పరిశీలిస్తే డైరెక్టర్ పవన్ సాధినేని కూడా ఇదే విధానాన్ని అనుసరిస్తున్నట్లు కనిపిస్తోంది. ఈ



సినిమా నుంచి మొదట రిలీజైన గ్లింప్స్‌తో సినిమా విజువల్ టోన్, కథలో ఉండబోయే ఎమోషనల్ వరల్డ్ పై చిన్న హింట్ ఇచ్చిన చిత్రబృందం, ఇప్పుడు తాజాగా దుల్కర్ బర్త్ డే సందర్భంగా రిలీజ్ చేసిన ఫస్ట్ సింగిల్ ద్వారా ఆ వరల్డ్ ను మరింత దగ్గరగా పరిచయం చేసే ప్రయత్నం చేసినట్లు సినీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. ఒక సినిమా ప్రమోషన్‌లో ప్రతి అప్డేట్ కథను మొత్తం బయటపెట్టకుండా, దాని భావాన్ని మాత్రమే ఆడియన్స్ వరకు తీసుకెళ్లడం ప్రస్తుతం అనేక మంది డైరెక్టర్లు అనుసరిస్తున్న ట్రెండ్. ఆకాశంలో ఒక తార కూడా అదే దారిలో ముందుకు వెళ్తోందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.పవన్ సాధినేని గతంలో తెరకెక్కించిన సినిమాల్లో కూడా క్యారెక్టర్ల ఎమోషన్స్ కు, వాటి మధ్య ఉండే సంబంధాలకు ప్రత్యేక ప్రాధాన్యం కనిపించింది. ఈసారి కూడా అదే శైలిని కొనసాగిస్తూ, క్యారెక్టర్ల జర్నీని నెమ్మదిగా ప్రేక్షకులకు పరిచయం చేసే విధంగా ప్రమోషనల్ ప్లాన్ ను రూపొందించినట్లు కనిపిస్తోంది. ఒక గ్లింప్స్‌తో ఆసక్తిని రేకెత్తించి, తర్వాత సాంగ్ ద్వారా కథలోని భావాలను పరిచయం చేయడం ఆ స్ట్రాటజీలో భాగంగా భావించవచ్చు. ఇటీవల సినిమాల ప్రచారంలో ఒక్కో కంటెంట్‌ను ఒక్కో ఎమోషన్ కు ప్రతీకగా రిలీజ్ చేసే విధానం బాగా పెరిగింది. దీంతో ఆడియన్స్ ప్రతి అప్డేట్‌ను విడివిడిగా ఆస్వాదించడమే కాకుండా, సినిమా గురించి తమలో తామే ఒక అంచనాను నిర్మించుకుంటారు. ఆకాశంలో ఒక తార ప్రమోషన్స్ కూడా అదే ఫార్ములాను అనుసరిస్తున్నాయనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. గ్లింప్స్‌తో మొదలైన ఇంట్రెస్ట్, ఇప్పుడు సాంగ్ తో మరింత బలపడనుందని సోషల్ మీడియాలో జరుగుతున్న డిస్కషన్స్ సూచిస్తున్నాస్పెషల్ గా ఫ్యామిలీ ఆడియన్స్, యూత్ , ఎమోషనల్ కథలను ఇష్టపడే సినీ అభిమానులను దృష్టిలో పెట్టుకుని ప్రమోషనల్ కంటెంట్ రూపొందించినట్లు విశ్లేషకులు చెబుతున్నారు. కథను ముందే చెప్పకుండా, దాని సోల్ ను మాత్రమే పరిచయం చేయడం ద్వారా ఆడియన్స్ లో క్యూరియాసిటీని నిలబెట్టడం డైరెక్టర్ మెయిన్ టార్గెట్ గా కనిపిస్తోంది. సినిమా రిలీజ్ కు ఇంకా టైమ్ ఉన్నప్పటికీ, ఇప్పటివరకు వచ్చిన ప్రతి ప్రమోషనల్ మెటీరియల్ ఒకే ఎమోషనల్ లైన్ ను కొనసాగిస్తుండటం విశేషం. అదే కంటిన్యూ అయితే ఆకాశంలో ఒక తార ఆడియన్స్ అంచనాలను మరింత పెంచే అవకాశాలున్నాయని ట్రేడ్ వర్గాలు భావిస్తున్నాయి. ఇప్పుడు మేకర్స్ రిలీజ్ చేసే నెక్స్ట్ అప్డేట్ ఆ ఇంట్రెస్ట్ ను నెక్స్ట్ లెవెల్ కు తీసుకెళ్తుందా లేదా అనేది చూడాలి.

Published & Owned by CHERUKU UPENDAR on behalf of HAMSA PUBLICATIONS,Pulblished at H.No:7-83/2, HANUMAN NAGAR COLONY, KUNTLOOR,ABDULLAPURMET MANDAL,Hayanthnagar,Rangareddy District/Hyderabad City,Telangana-Pin:501505. Printed by RATNA GRAPHICS at H.No.2-3-703/7,Tirumala Nagar Colony,Police Lane,Amberpet, Hyderabad-500 013 Telangana.Editor: CHERUKU UPENDAR E-mail:prabhathasuryudueditor@gmail.com PRGI Reg No:TGTEL/25/A0555